# అవగాహన

వి. హరికృష్ణ

శ్రీవిద్య పాఠం చెప్తూంటే స్టూడెంట్స్ నాగస్వరం వింటూన్న నాగుబాముల్లా తల లూపుతూ ఆసక్తిగా వింటున్నారు.

ఆమె క్లాసంటే పిన్‌డ్రాప్ సైలెన్స్!

శ్రీవిద్య పిల్లల్నేమీ అనదు, కొట్టదు, ఓ విధమైన శాసనం ఆమె గొంతులోనే వుంది. చెప్పే మాట ధోరణిలోనే వుంటుంది.

అదే కఠినంగా మందలించడం, బెత్తంతో కొట్టడం స్థాయి దాటింది. అంత ప్రత్యేకత కలది కాబట్టే ఆమె క్లాసంటే స్టూడెంట్స్ ఎగనామం పెట్టకుండా వస్తారు.

అది కో–ఎడ్యుకేషన్ స్కూలు.

ఆడ–మగ కలిసి ఒకే క్లాసులో 'చదువుకొంటూండడంవల్ల పైపెచ్చు శ్రీవిద్య రంభలాంటి అందగత్తె కాకపోయినా స్త్రీకుండాల్సిన హంగులు సమపాళ్ళలో ఫర్వాలేదనిపించేంతగా—నడక, చూపుల్లో కొట్టొచ్చినట్టుగా ఆకర్షణ ఆడపిల్లలకే కనిపిస్తూంటుంది. ఇక మగ పిల్లల సంగతి చెప్పాలా?

అది పధ్నాలుగేళ్ళ ప్రాయం దాటిన మగపిల్లల క్లాసు. అప్పుడే మొలక మీసాలు, మనసు—చూపులో ఆడదంటే తెలియని ఆసక్తి తలెత్తుతున్నందున శ్రీవిద్య ఎంత గురువైనా, ఆమె చెప్పే పాఠాలకన్నా, మూర్తినే రెప్పార్పకుండా చూస్తుంటారన్న సంగతి శ్రీవిద్యకూ తెలుసు!

ఏ లేడీ టీచరూ విద్యార్థులను 'నాకేసి అలా తినేసేలా చూస్తారెందుకు? అసలు నేను చెప్పే పాఠాలు మీ చెవికెక్కుతున్నాయా?' అని అడగలేదు. ఎందుకంటె—తను స్త్రీ.

యవ్వనంలో అడుగు పెడ్తున్న వాళ్ళనలా కదిపి, ఒకవేళ వాళ్ళలో ఆ ఉద్దేశ్యం లేకున్నా లేనిపోని ఆలోచనలు కలగ చేయడం భావ్యం కాదని.

ముఖ్యంగా ముందు వరస బెంచిలో కూర్చునే రవి చాలా గడసరి. 'రవీ, స్టాండ్ అప్! ఇప్పుడు నేనేం చెప్పాను?'' అతని చూపులు తన స్త్రీత్వానికి ప్రతీకలైన అన్నిటికేసీ ఆబగా చూస్తుండడం గమనించి భరించలేనట్లు ఒక రోజు హఠాత్తుగా నిలబెట్టింది శ్రీవిద్య.

అతను పాఠంకేసి మనసు లగ్నం చేస్తూంటే కదా, అడగ్గానే పాయింట్ చెప్పడానికి. "మేడం! మీరేం చెప్తున్నారంటే..." గుటకలు మింగాడు తలొంచుకుంటూ, ఎక్కడ తన అన్యమనస్కం బయటపడిపోతుందోనన్న గిల్టీ కాన్షస్‌తో, 'ఇలాగైతే పరీక్షలేం రాస్తావ్? బాడీ ప్రజెంట్, మైండ్ ఆబ్సెంట్...'' శ్రీవిద్య తేలిగ్గా నవ్వేసింది.

'నన్ను చూస్తూండడంతోనే చాలదు, పాఠమూ వినాలన్న ఇంగితం వుండాలి. అప్పుడే నువ్వు బాగుపడేది...' అనుకొంటూ అతన్ని కూర్చోమని చెప్పి తన పాఠంలోకి మళ్ళింది.

చిత్రంగా ఇదే రవి తన దగ్గర ట్యూషన్ చెప్పించుకోవాలని అతని తండ్రిని పంపినపుడు ఖండితంగా చెప్పేసింది.

"మీ అబ్బాయి క్లాసులోనే సరిగా పాఠాలు వినడు. ఇంక ఇంట్లో ఏమాత్రం శ్రద్ధ చూపిస్తాడు? "అలాంటి డిసిప్లిన్ లేని పిల్లలంటే నాకసహ్యం! అతను క్లాసులో పాఠం వినకుంటే, ఇంట్లో చదూకోకుంటే నాకొచ్చిన నష్టం ఏమీ లేదు''



అంటూ రవికి ట్యూషన్ చెప్పడానికి తను సనే మిరా ఒప్పుకోలేదు.

అతని తండ్రి ఎక్కువ డబ్బు ఇస్తానని ఆశ పెట్టినా లొంగింది కాదు. అంతమంది వున్న క్లాసులోనే తనంటే అభిమానం చూపే అతను ఇలా ప్రైవేట్‌గా ఒకరెదుట ఒకరుగా వుంటే ఏ అఘాయిత్యం చేయడానికైనా వెనకాడడేమో?

ఈ కాలం పిల్లల్నెవరు నమ్మొచ్చారు?

అసలు ఈ పథకం వేసుకొనే తండ్రిని మధ్యవర్తిని ఇలా తన దగ్గరకు బయలుదేర దీశాడేమో?

వెరీ కన్నింగ్ క్రీచర్!

ఎంతో నచ్చచెప్పి చూసి లాభంలేక పోయేసరికి తల వేలాడేసుకెళ్తున్న రవి తండ్రిని చూస్తూ కొంచెం జాలిపడింది శ్రీవిద్య. ఈ సంగతి తన క్లోజ్ ఫ్రెండ్‌తో చెప్పుకుంది, ఆ వేళ మధ్యాహ్నం లంచ్ తీసుకొంటూ.

"చూడు శ్రీవిద్యా! లోకమే ఆకర్షణీయం. నువ్వు ఒకే సైడ్ ఆలోచిస్తున్నావ్. ఆ రవి నీకేసి ఆ దృష్టితోనే చూస్తున్నాడని ఎలా నిరూపించగలవ్? అందమైన వస్తువున్నా, మనిషినీ ఆరాధనగా చూసే హక్కు ప్రతి ఒక్కరికీ వుంది. రవి ఉద్దేశ్యం ఇదేనని నువ్వెందుకు అనుకోకూడదు..."

"అలాగే అనుకునేట్లయితే ఇప్పుడేం చెప్పాలని అతన్ని కదిపితే గిల్టీగా తలొంచుకున్నాడే...అది తప్పుడుద్దేశ్యం కాకమేగా..." స్నేహితురాలు తనతో ఏకీభవించడం లేదని, తను నమ్మితే ఆమె కూడా నమ్మాలన్నట్లుగా చెప్పి చూసింది శ్రీవిద్య.

అదోలా నవ్వేసింది సూర్యకుమారి "మళ్ళీ నీ ట్రాక్‌లోకే వెళ్తున్నావ్. అతను పసివాడికిందే లెక్క.

"కొందరికి చూపులే కానీ చెవులుండవు. బహు కొద్ది మందికే రెండూ పనిచేస్తుంటాయి. నువ్వు అందగత్తెనని, నీ రూపం ఎడ నీకే అతిశయముందని ఈ రూపే నిరూపించుకుంటున్నావే కానీ నీ టీచింగ్ మీద నమ్మకం లేదు. అది చాలా ప్రభావితం చేస్తుంది కాబట్టే రవికి సక్కంట్లో వేసున్నా, నీతో సమానమైన క్వాలిఫికేషన్ నాకున్నా, నన్ను కాదని అతని తండ్రిని ట్యూషన్ కోసం నీ దగ్గరకే పంపాడంటే ఆలోచించు. స్కూలంతా టీచర్‌గా నీ పేరుఎలా మార్మ్రోగుతోందో..."

ఆలోచిస్తే సూర్యకుమారి వాదన కరెక్టేనని పించింది శ్రీవిద్యకు. ఓ నిర్ణయానికి వచ్చినట్లు ఆ మర్నాడే క్లాసయ్యాక "రవీ! మొన్నోమారు మీ నాన్నగారొస్తే ట్యూషన్ చెప్పలేనని ఏదో మూడ్‌లో రెఫ్యూజ్ చేశాను, ఏమనుకోకు! రేపట్నుంచే ట్యూషన్‌కు రా రాత్రివేళల్లో. స్కూలుకు సెలవైతే పగటిపూట పెట్టుకుందాం..." అని చెప్పింది.

"అలాగే మేడం!" అన్నాడు రవి ఆనందంగా. అనతికాలంలోనే అతను బ్రిలియంట్‌గా, మంచివాడుగా నిరూపించుకున్నాడు. ఇంతకు ముందు తను అతన్ని పొరపాటుగా అర్థం చేసుకున్నానన్న నిర్ణయానికొచ్చింది శ్రీవిద్య.

"నువ్వు చెప్పిందే కరెక్ట్ కుమారీ! రవి ఈ సంవత్సరం ఫస్ట్‌ర్యాంక్‌లో పాసయ్యాడు. అతని గురించి అపోహ పడినందుకు ఇప్పుడు పశ్చాత్తాప పడుతున్నాను." తన వంతు తప్పిదాన్ని స్నేహితురాలిముందు ఒప్పుకుంది శ్రీవిద్య.

"ఈ అవగాహన కొరవడబట్టే లేడీ టీచర్స్‌కూ, మగ స్టూడెంట్స్‌కూ చాలా చోట్ల గురు శిష్యుల అనుబంధం దెబ్బతింటోంది" అనుకుంది సూర్యకుమారి చిరునవ్వు నవ్వుతూ. ■

## * నగలషాపు

ఓ పెద్ద మనిషి కోపంగా నగలషాపులోకి అడుగు పెట్టాడు. "ఏనయ్యా! ఈ నెక్లెస్ చూడు. రెండు రోజుల క్రితం పట్టుకెళ్లాను. అప్పుడే తెగిపోయింది. ఈ నెక్లెస్ నాకొద్దు. నా డబ్బు నాకిచ్చేయ్." అన్నాడు.

"డబ్బు తిరిగి ఇవ్వం. కావలిస్తే మా షాపు యజమానిని అడగండి" అన్నాడు అక్కడి సేల్స్‌మన్.

"ఏనండీ విన్నారా మీ సేల్స్‌మన్ మాటలు. అతనికేమీ తెలియదట" అడిగాడు పెద్దమనిషి.

"అతను చెప్పింది కరక్టే!" షాపు యజమాని అన్నాడు.

"అదేమిటయ్యా నువ్వూ అలాగే అంటావు. మీ షాపు బయట నువ్వు పెట్టిన బోర్డు మీద ఏం రాసుందో తెలియదా? 'నచ్చని యెడల డబ్బు వాపసు ఇవ్వబడును' అని రాశావు కదా. మీ నెక్లెసు నాకు నచ్చలేదు. నా డబ్బు నాకిచ్చేయ్" అన్నాడు పెద్దమనిషి.



"అయ్యా! తమరు పొరపాటు పడ్డారు. మీరిచ్చే డబ్బు మాకు నచ్చకపోతే, ఆ డబ్బు వాపసు ఇస్తాం అని దాని అర్థం. మీ డబ్బు మాకు నచ్చింది. కాబట్టి వాపసు ఇచ్చే ప్రసక్తి లేదు" అన్నాడు షాపు యజమాని.

— [illegible]

# దొంగలు

శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం ఎప్పటిలాగే భక్తులతో కళకళలాడుతున్నది. రాజారావు లైనులో నిలబడి వున్నాడు. అతని మొహంలో భక్తి భావానికి బదులు ఏదో దిగులు కనబడుతున్నది. ఎప్పుడెప్పుడు గుడిలో నుండి బయటపడదామా అని అనిపిస్తున్నది.

రాజారావుది మధ్యతరగతి కుటుంబం. అతనికి దైవభక్తి ఎక్కువ. భార్య కాన్పు సజావుగా అయితే కొబ్బరికాయ కొడతానని మొక్కుకున్నాడు.

"ఈమధ్య దొంగల భయం మరీ ఎక్కువైపోయిందండీ! మనతోనే వుంటాడు, మనకు తెలియకుండా కాజేసుకుపోతాడు" ముందున్న పెద్దమనిషి ఎవరితోనో అంటున్నాడు. ఆ మాటలు వినగానే రాజారావు గుండెలు జారిపోయాయి. రూపాయి పొదుపు చేయబోతే వంద రూపాయిలు నష్టం కలుగబోతున్నదే అని తెగ దిగులుపడసాగాడు. అసలు గుడి బయట చెప్పులు విడవడానికి ప్రత్యేక స్థలం వుంది. కాని అక్కడ రూపాయి ఇవ్వాలి. ఇంత ఖర్చులో ఆ ఖర్చెందుకని రాజారావు అక్కడ కూర్చుని అడుక్కునే ముసలిదానికి పావలా ఇస్తానని చెప్పి తన చెప్పులు అప్పచెప్పి వచ్చాడు. తీరా లోపలికి వచ్చాక మనసులో అనుమానం మొదలైంది. ఆముసలిది తన చెప్పులు వుచ్చుకుని వెళ్ళిపోదుకదాని!

ఎలాగో దైవదర్శనం అయిపోయింది. "భగవంతుడా! నా చెప్పులను సురక్షితంగా కాపాడు. అర్థ రూపాయి చక్కెర ప్యాలాలు సమర్పించుకుంటాను" అని మనసులో మొక్కుకున్నాడు రాజారావు. వెంటనే ముసలిది కనబడదేమో అని హడావుడిగా, ఆదుర్దాగా గుడి బయటికి వచ్చాడు. ఆ బిచ్చగత్తె అక్కడే కూర్చుని వుంది. జేబులో నుంచి చిల్లర తీసి వేగంగా ముసలిదాని దగ్గరకు వెళ్ళాడు. ముసలిదానిని చూడగానే రాజారావుకి లాటరీ తగిలినంత సంతోషం కలిగింది. కళ్ళు సరిగ్గా కనబడని ఆ ముసలిది చీకట్లో ఇంకొకరి చెప్పుల జత తీసి ముందుంచి 'ఇవేనా?' అని అడిగింది. తన పాత చెప్పులకు బదులు తళతళ మెరుస్తున్న కొత్త చెప్పులను చూడగానే ముసలిదాని చేతిలో చిల్లరపెట్టి ఆ చెప్పులు తొడుక్కుని పరుగులాంటి నడకతో జనంలో కలిసిపోయాడు రాజారావు!

—శైలజ